# మేలుమలుపని కన్నీరు

గోదావరిమీద సూర్యాస్తమానము అవుతూవుంటే నిజంగా ప్రకృతీ పురుషులు అభేదస్వరూపాలయి ఆవలివంచనే తాండవిస్తూవున్నట్టుగా వుంటుందిదృశ్యం. చెట్లయొక్క పచ్చదనంలో కలిసిపోయినవాడై క్రిందకిదిగిపోతూ వున్నాడా పరబ్రహ్మస్వరూపుడా సూర్యభగవానుడు అన్నట్టు అతిప్రశాంతంగా అగపిస్తూవుంటుంది ఎర్రని తేజోగోళం.

ఆ వేళకు దరిన్నీ అంతప్రశాంత స్థాయినీ అనుభవించడానికి సంసిద్ధమై యుంటుంది కూడాను. రాధారి పడవలన్నీ వెళ్ళిపోతాయి. ఒకటీ వుండదు. వాటితోపాటు మోటబళ్ళూ కూలివాళ్ళూ, జంతికలూ, జంగాలూ, అంతా మటుమాయమై పోతారు. వచ్చేనే స్టీమర్లు వచ్చేనేసి జనాన్ని అప్పటికప్పుడే దింపేనేసి నిప్పు చల్లారి, నిమ్మకు నీరోసినట్టు కూతకూడా మఱచిపోయి వుండిపోతాయి.

అటువంటి మహత్తర ప్రశాంతభావమప్పుడు, ఒక రేవులో ఒకచోట, ఒకరికొకరు అనతిదూరంగావుండి, ఒక పశువుతో, ఒక జడపదార్థంతో ముగ్గురు జనం కనిపించారు. పశువు అన్నది గేదె. నల్లని పెద్దగేదె. ఆ గేదెను నీటిలో కడుగుతూ వున్నాడు దానితో సమానమైన నల్లని శరీరచ్ఛాయగలవాడై యొకానొక గొల్లవాడు. జడపదార్థ మన్నది ఒక పాత మట్టికుండ. అదీ నల్లగా వుండి నీట ముంచబడుతూ వుంది ఒకానొక హరిజన స్త్రీచే. హరిజనస్త్రీ కూడా తాను ముంచేకుండ రంగు కేమాత్రం తీసిపోని శరీరచ్ఛాయ గలిగినదై యుండడమే

కాకుండా అరవై ఐదేళ్ళ వయస్సు గల ముదుసలి మనిషికూడా అయివుంది. మరి మూడో వ్యక్తి బ్రాహ్మణోత్తముడు. ఇరవై యేళ్ళుంటాయి. పచ్చని శరీరం. తెల్లని జన్నిదాలు మెరసేటట్టు సరుదుకుని, ఉత్తరీయం నడుముకు కట్టుకుని, అతగాడు మోకాటి బంటి నీట సూర్యుని కెదురుగా నిలుచుండి సంధ్యావందనం గావిస్తూ వున్నాడు.

యధాతధంగా తెలియచేదామని పై వర్ణన గావించేనేగాని యదార్థం తలపోసి చూస్తే అస్తమయ కాంతిలో సవర్ణులూ అవర్ణులూ అందరూ వొకటే.

ఆ గొల్లవాడు గేదెమీద నీళ్ళుపోసి, వట్టిగడ్డి రవ్వంత తెచ్చుకున్న దెక్కడిదో పుచ్చుకుని, తోముతూవున్నాడు గొడ్డు మకిలిపోయేటట్టు. ఈ హరిజన స్త్రీ కుండముంచి పైకెత్తుకోలేక ఎత్తుకోలేక కుండ మోకాలిచిప్ప ఎత్తుకెత్తుకున్నదై దిక్కులు కలయచూస్తూవుంది. బ్రాహ్మణోత్తముడు “ఆసావాఽ దిత్యో బ్రహ్మ” అని ప్రదక్షిణంగా తిరుగుతూ చుట్టూ నీళ్లు వదుల్తూ వున్నాడు. సూర్యభగవానుడు మరికొంచెం దిగిపోయేడు పడమటిదెస.

“ఓ సూర్యభగవానుడా! నాకీ బరువుకుండ కొంచెం పైకి నెత్తిమీదికి లేవనెత్తకుండానే క్రుంకి పోతావా?” అన్నట్టు జాలి చూపులు చూచింది హరిజన స్త్రీ. గొల్లవా డూరికే అలాగే తన గేదెను తోముతున్నాడు గాని ఆ బలహీనురాలి దైన్యావస్థను తెలిసికొని యుండలేదు, కాని బ్రాహ్మణోత్తముడు తన ప్రదక్షిణంలో అవగాహన గలవాడై దయ అన్నదే మతం, పరోపకార మన్నదే సంధ్యావందనం అని లోలో నిశ్చయించు

కొని తన సంధ్యావందనంలో తాను తన చుట్టూ తిప్పుకొన్న చేయిని కొంచెం చాపి ఆ హరిజనస్త్రీ యెత్తుకొనే నీటికుండ మీద ఆంచి ఆ బరువు దాని తలకెత్తి "ముసిలీ! జాగ్రత్తగా గట్టెక్కు! పడిపోతివా కుండా నీవూ కూడా అజామతే" అన్నాడు.

ముసిల్ది "ఇప్పుడప్పుడే సావనులే బాబా! మీరు బామ్మర్లా? మీపేరు?" అని అడిగింది. గొల్లవాడు "పోవే! నీ కెక్కడిలేని వాకబూ కావాలి! ఆయనేదో కనికరించి కాస్తంత కుండెత్తితే ఆరిపేరూ వూరూ అన్నీ తిదోర నచ్చత్రాలడిగినట్టు అడుగుతున్నావు. ఆరేం నీవిచ్చే పాత్తర్లదతారను కున్నావా? నీ యింటికొచ్చేరను కున్నావా?" అని కసిరేడు. మాలది వెళ్ళి పోయింది.

బ్రాహ్మణుడు గొల్లవానితో "అలా కసరడమెందుకు దాన్ని. అదీ మనిషేచూడూ! ఏదోవింతకొద్దీ అడిగివుంటుంది. పాపం! నీవన్న మాటలకు దాని మనస్సెంత నొచ్చివుంటుందో" అన్నాడు. గొల్లవాడు బ్రాహ్మణునితో "కాదండీ! మఱి మీరు మా యిళ్ళకు పాత్తర్లకొచ్చినట్లు వాళ్ళయిళ్ళకు వెడతారా?" అన్నాడు. "దానికి ఇల్లంటూవుంటే వెళ్ళినా తప్పులేదు. నీకు నీ యిల్లెలాంటిదో దానికి దాని యిల్లూ అలాంటిదే. నీ యింటికి అంతా పదిమందీ బ్రాహ్మలూ ఆప్తులూ చుట్టాలూ పక్కాలూ అందరూ రావాలని ఏలా నీవనుకుంటావో అదీ ఆలాగే అను కొంటూ వుంటుంది." అని అన్నాడు బ్రాహ్మణుడు. "ఇంతకూ దానికి ఇల్లేలేదులెండి! మీరన్నట్లు అనుకోవడానికి" అంటూ గేదెను గట్టెక్కేసి తాను కాళ్ళు నీళ్ళల్లో యీడించుకొని గొల్లడు వెళ్ళిపోయినాడు.

ఒక దశదాపేవరకూ ఆ హరిజనస్త్రీగాని, ఆ గొల్లవాడు గాని, ఆ విప్రుడుగాని ఒకరినొకరు మళ్ళీ కలుసుకోనేలేదు. ఇంతకూ వకవేళ కలుసుకున్నా వాళ్ళూ వాళ్ళూ పరస్పరావలోకనం గలగజేసుకొని పలకరించుకోవలసినంతటి ప్రత్యేక పరిస్థితు లెట్టివిన్నీ కలిగియుండలేదు. అంతేగా సర్వసామాన్య జీవిత రహస్యము. మనం రోజూ బజార్లో కూరకొంటాము. ఆ కూర లంగడివాడే వేరే ఎక్కడో కనబడతాడు. మనకేంపని వాణ్ణి పలకరించడానికి మంగలివాడు యింటికివచ్చి క్షౌరంచేసి పోతాడు. ఆ మంగలివాడే ఎక్కడో వీధేపోతూ కనబడతాడు. మనకేంపని వాణ్ణి పలకరించడానికి? ఆ వేళ ఏదోతోచి కాస్తంత ఆ హరిజన జరరకు తోడయ్యేడేగాని ఆ బ్రాహ్మణుడు మళ్ళీ అది కనబడితే పలకరించవలసిన జరుగురేమున్నది అతగాడికి? గొల్లవాని మాటా అంతే! ఏదో తనకు దోచి ఆనాడు ఆ ముసిలిదాన్ని తాను మందలించాడేగాని మళ్ళీ దాని యూసు అతడిక్కావాలా?

ఇలాగ్గా ఒకదశ వెళ్ళిపోయింది. దశఅంటే పదేళ్ళు. పదేళ్ళు దేశనాయకులకు గడిస్తే వారి ఆత్మ చరిత్రల్లో వంద పుటల సమాచారమెక్కుతుంది. చరిత్రకారుని దేశచరిత్ర మరి మూడువందల పుటల సంజాయిషీతో వుబ్బిపోతుంది. కాని సామాన్యజనుల జీవితాల్లో ఒక్కొక్కప్పుడు చెప్పుకోదగ్గ వాక్క విశేషమున్నూ వుండకపోవచ్చు. అయితే అటువంటి వాళ్ళను భగవంతుడు ఎందుకు నిర్మాణం చేస్తూవుంటాడు మరి? అందు లోనూ బాగా లెక్కించి చూస్తే కోటిమందికీ ఒక్క పురుషుడు వీరనాయకుడైనట్టు వినబడుతూ వుంటాడే తక్కిన వాళ్ళ జీవితా లన్నీ విస్మృతాలేనా? కావు! కావు! ఆ జీవితాలను చూడవలసిన

దృక్పథం వేరు. వాళ్ళయొక్క సర్వసామాన్య నిత్యజీవన సరళియే ఒక వ్యంగ్యం! అదే ఒక మహదాశయం! అదే ఒక రూపం! అదే ఒక దీపం!

మీ కుదాహరణ కావాలీ అంటే యీ కథలోని ముగ్గురు జనంలోనూ మిక్కిలీ నికృష్టురాలిగా దోచే వృద్ధ హరిజన స్త్రీయొక్క సర్వసామాన్య నిత్యజీవన సరళి ఏమిటో? దిఙ్మాత్రంగా సూచిస్తాను. చూతురు గాక!

దాని కులం ఏమిటో ఎవరికీ తెలియదు. అడిగితే మాత్రం చెప్పరాని దాన్ని అని అది తనంతవే కొంచె మను కుంటా తొలగిబోతూ వుంటుంది. దానికి యిల్లూ, వాకిలీ తల్లీ తోడూ ఎవళ్ళూ వున్నట్టు దోచదు. పట్నానికి దక్షిణపు వెరపిని వున్న స్మశానం ఆ చాయల ఒక రావిచెట్టు నీడపట్టు మన్నగా తుడుచుకొని, అక్కడే రెండుకుండలూ అదీ కాపరం. చెట్టుకో తాటాకు గొడుగు వ్రేలాడదీసికొన్నదే ఆమెకు పరంబీ సౌలభ్యం. దానికి జీవనాధారాలు ఏరుబిడకలు. అవి యేరుకుని వాటి నమ్ముకుని రోజూ ఒక అణాడబ్బులు సంపాదించు కుంటుంది. ఆ అణా డబ్బుల్తోనూ గంజీ, నంజుడూ వుప్పూ, వస్త్రా, అన్నీ సంబాళించుకుంటుంది. ఎప్పుడన్నా బమారితే కోమటి కొట్టుకెళ్ళి ఏగాణి కందిపప్పు తెచ్చుకుని మెత్తగా కాటు కలా వండుకు తింటుంది. అదే పబ్బం పప్పు దానికి. రెండో వాళ్ళ జోలీ సొంటూ దాని కక్కరలేదు. పైపెచ్చు తన బ్రతుకు పంధానే ఆర్థికసూత్రాలు, సాంఘిక సూత్రాలు, రాజకీయ సూత్రాలు అన్నీ యిమిడి వున్నాయి అని ఉద్ఘోషిస్తూ వుంటుంది. ఎవరైనా ప్రశ్నిస్తే "పెట్టుబడికి డబ్బెక్కడిదండీ నాకు?

అంచేత పెట్టుబడి అవసరం లేని యీ ఏరు బిడకల్తో వ్యాపారం గావిస్తూవున్నాను" అంటుంది. "అంటిపెట్టుక్కూడా వచ్చే వాడెవడు చెప్పండీ యీ జీవం కాస్తాబోతే. అంచేత సంఘంతో సంబంధం పూర్తిగా విసర్జించేశా" నంటుంది. "రాజులు దిగి రాజులు సింహాసనా లెక్కినా నా మర్యాద నేనే కాపాడు కోవాలి గాని ఒక్కడూవచ్చి కాపాడలేడుగదా" అని జవాబు యిస్తుంది. "మరి స్మశానంలో మనుష్యుల కొవ్వుమండి వెలుగుతూ వుండే కంటె ఎక్కువ జ్యోతి ఏముంది కనుక--మరి రకరకాలుగా ఈ అరుబయట గోదావరి గాలి వీస్తూంటే యింతకంటే ప్రాణాల్ని నిలిపే యుపాయశాలి మరెవ్వరున్నారు?" అని ఊరికే తన చుట్టూమూగే విద్యార్థులకు సన్యాసులకు బోధచేస్తూ వుంటుంది.

అలాగ్గా రెండుమూడు దశలు మనం వినకుండానే మనం కనకుండానే నిరాటంకంగా వెళ్ళి పోయినాయి. ఆ హరిజనస్త్రీవి, మనం విన్నాక మరోదశ కడచింది.—

పై ముగ్గురు జనాన్నీ కూడా మనం ఈ పాటికి మరచి పోయినామన్నాగాని అతిశయోక్తి కానేరదు.—

ఒకానొకరోజున అపరాహ్ణం నాల్గింటికి బ్రాహ్మణవీధిని బ్రాహ్మణుడొకడు కాలంచేసినాడు. కాలగర్భులనందర్నీ సర్వ సాధారణంగా రెండు రకాలవాళ్ళగా గుర్తించొచ్చు సకాలంలో పోయినవాళ్ళనీ, అకాలంలో పోయినవాళ్ళనీ. ఇతడు అకాలంలో పోయిన మనిషి క్రిందకే వచ్చి తన యింటిల్లిపాదికే కాకుండా ఇరుగుపొరుగు వాళ్ళక్కూడా దుఃఖం కలిగించాడు అయినాగాని అంత్యక్రియ తప్పదుగా ఎటువంటివానికీ! అయిదు గంటలకన్నీ సంసిద్ధంచేసి నగరమమ్మట మోసి మోసి దక్షిణ స్మశానముకు గాను గట్టు దిగారు ప్రజలు.

వారు గట్టు దిగీ దిగడంలో పడమటిగాలి అదివరకే గోదావరి లంకలమీది యిసుక రేకొ్కాడుతూ వున్నదల్లా నీళ్ళు దాటి యీవల బయిలున రంయిని మేఘంలోకూడా వీవదొడ గింది. అయినా శవ దహనం తప్పదుగా! కొందరు కొందరుకూడా వున్నవాళ్లు వెనక్కు తగ్గినా వాహకులు, అగ్నిహోత్రధారి, ఇలాంటివాళ్లు దహనసంస్కారం పూర్తి అయ్యే పర్యంతం వుండవలసిందేగా! చేరువలోనే అంటించేసి పోదామని కటుకు దింపేరు అక్కడే. కాని అప్పటికప్పడే మేఘం కారు కమ్ముకు పోతూవుంది. దూరాన్ని అప్పుడే వానప్రారంభించిన సూచనగా చల్లనిగాలి అందరి మొగాలమీదికీ వీస్తూవుంది. తక్కిన బ్రాహ్మ లందరూ కూడా వానరాకుండా వుంటే బాగుండును వోషుడియ అని దేవుణ్ణి ప్రార్థించడంతోపాటు పుల్లా పుడుకా పేర్చి కాడు అమర్చి తరువాయి సంగతి వాహకుల్నీ వాళ్ళనీ చూచుకోమని వెళ్ళిపోయినారు. పెద్దవుసిరికాయంత చినుకుతో ఆరంభించి ఫెడీఫెడీ నాలుగు చినుకులు కొట్టేసరికి వాహకుల్లో ఇద్దరు "మనం అంతా ఇక్కడవుండి మిడికేదేముంది. అందరూ చావాలా చచ్చిన వానితోపాటు. మీరిద్దరూ వుండి చావండి" అన్నారు, రెండోజత వాహకులు "పేర్చింది పేర్చనే పేర్చాం! నిప్పంటిం చండి" అని అగ్గిపట్టిన ఆతణ్ణి పురిగొల్పి మొదటి ఇద్దరి వాహకులకంటె ముందదుగ్గా బయలుదేరారు. మొత్తంమీద ఆ వాహకులు నలుగురూ కూడా వెంటనే వెనక్కు చూడకుండా వెళ్ళిపోయినారు.

పెద్ద వుసిరికాయంత చినుకు రాచవుసిరి కాయంతలోకి తరిగి, మరి అక్కడ నుంచి ముత్యాలుగా మారి హోరున కురు

స్తుంటే ఇకక్కడున్నది పుల్లలు మోసుకొచ్చిన చాకలి ఆ అగ్గి ముట్టించిన వారసు—చాకలివాడు బహుశా తగులడగా మిగిలిన కర్రలు పట్టుకుపోవడానికి, వారసు బహుశా మరి బతికిరాకుండా పూర్తిగా తగులడి పోయింది కట్టె అని నిర్ధారించుకోవడానికీ అక్కడ వుండి వుంటారు అని మనం అనుకొన్నా తప్పులేదు.

లోకంలో అంత స్వార్ధంవుంది—

లోకంలో అంత వ్యాపార ప్రవృత్తి బలిసింది—

కాని దేవుని యుద్యమం వేరు. ఎక్కడెక్కడికి ఎవళ్లెవళ్ల చేరవలసి వుంటుందో అంతవరకూ ఆలా నిలుపుతూనే వుంటాడు కట్టెను. కట్టె! దానిమీద అంత వ్యామోహం! ఎందుకూ అంటారేమో పాఠకులు — అదేగా యీ వివిధవిచిత్రాలకూ తావిచ్చేది! ఒకదానివంటి కట్టె మరొక్కటి కానవస్తుందా? కాబట్టి దానియొక్క కడసారికళ కన్నులార చూడవలసిందే! దానియొక్క కడాపటి ప్రభ మనసార సంస్మరింప వలసిందే!

జోరుగా వర్షం కురుస్తూ వుంది. మేఘం ఇంకా దళముగా అలముకు పోతూవుంది. గొడుగు లేదు. అదున్నా కొంత మెరుగే. చాకలిన్నీ వారసున్నూ అటూఇటూ చూచేరు. మరోగడియవుంటే ఆ బయలంతా నీటివెల్లువగా పొర్లెక్కి తెప్పానాం తేలానాంగా మారిపోతుందేమో కూడాను. మరి మానవరూపాలు ద్యోతకం కావడం లేదు. అయినా కేకేదో వినిపిస్తూవుంది.

గొల్లవాడు! మన గొల్లవాడు! వాని గేదె రెల్లుదుబ్బుల్లో దారితప్పి ఆ హోరు వానలో వానికిదొరక్క తిప్పలు పెడుతూ వుంది. వాడొక్కడు అంతవానలోనూ, సాయంత్రం పాలుపితికే వేళ దాటిపోతూవుంది, అని గేదెను పిలుస్తూ మళ్ళేస్తూవున్నాడు.

ఏలాగైతేం గొల్లవానికి గేదె దొరికింది. దాని మెడకు కన్నె తగిల్చి తనతోకూడా ఆ విసురుముసుర్లో ఆ రుద్రభూమిని లాక్కువస్తూ వున్నాడు. ఆ గొల్లవానికి దారిలో దసులయ్యింది పైశవ దహన దృశ్యం!

కొత్తగా వానలో తడిసి బాధ పడ్డమనేది గడ్డుగాని, అదివరకే తాను తడిసిబోయి వణుకుతూ వున్నవాడవడంచేత వాని కష్టంలాంటిదే అని గొల్లవాడా వణుకుతూ నిలబడ్డ తక్కిన ఇద్దరి మనుష్యుల్నీ, ఆ కట్టెనూ బోల్చి గేదె సమేతంగా ఆగి పరకాయించాడు. "వాన తగ్గిపోతుంది గాని బాబుల్లారా! మరి యీ పుల్లలు పిడకలుంటేనేగాని అంటుకోవు." అని "కాష్ఠం తగులడీ అదృష్టం కూడా లేని యీ ప్రేత ఎవరా" అన్నట్టు చూచాడు ఉత్తిబొందికేసి. చూచి వారితో ఏమీ విశేషం మాటాడకుండా చాకలితో ఆ గేదెను పట్టుకోమని—"మీ క్కావలిస్తే ఆ రావిచెట్టు క్రింద మాలదాని దగ్గర ఎండు ఏరుబిడకలు తీసుకొస్తాను" అన్నాడు.

వారసు "అది డబ్బులడుగు తుందేమో?" అన్నాడు. "అడిగితే రేపివ్వచ్చునులెండి" అని గొల్లడు ఈ కథకంతకూ ముఖ్యపాత్ర అయిన హరిజనస్త్రీ కడకు వెళ్ళినాడు. ముసిలి మాలెత అప్పటికప్పుడే తన ఏరుపిడకలన్నీ, ఓ కుండలో నీళ్ళు వొలకపోసి, ఆ కుండ లోతు చెయ్యెట్టి తుడిచివేసి, అందులో పడవేసిందై, చెట్టునున్న గొడుగా కుండ మీద బోర్లించి ఆ పక్కనే కూర్చుని వణుకుతూవుంది.

"చూడు ముసిలీ!" అన్నాడు గొల్లవాడు. "ఏం బాబా! నా అవసరం ఏమొచ్చింది?" అంది ముసిల్ది. "చూడు పదేళ్ళ

క్రిందట నీకు గోదావరిలో కడవెత్తిన బాపనయ్య యీ రోజున కాలం చేసినాడు పాపం!" అన్నాడు గొల్లడు. "ఆఁ ఆ! నా కళ్ళముందే? అయ్యో నా తండ్రీ!" అంది విస్తుపోతో విలపిస్తూ అది. "చూడు" అన్నాడు గొల్లడు. "నీకు రేపిస్తాను గాని కాణీ" అని కూడా వెంట వెంటనే వక్కాణించాడతడు. ముసిల్దాని కప్పుడే అర్ధమయి పోయిందంతాను. "అక్కర్లేదు నాయనా! నాకు డబ్బులొద్దు బాబా! ఇందాకట్నుంచీ కనిపెడు తూనే వున్నాను. వాళ్ళేనా నాయనా! వాళ్ళు!" అంది. "అవును వాళ్ళే! నీ ఎండుపిడకలు కొన్ని వాళ్ళ కందియ్యాలి!" అన్నాడు. "అదే నే ననుకుంటూన్నదీని" అని వెంటనే కుండెడు ఏరుపిడకలూ గొడుగు బోర్లింపుతోసహా నెత్తినెట్టుకుని నడచివెళ్ళింది గొల్లనితో మాతంగి ముదుక.

అంత దూరాన్ని దించింది కుండా గొడుగూ—చాకలి "యీ వానకాళ్ళు చాలకనా తల్లీ! కుండతో నీళ్లు మోసు కొచ్చావు" అన్నాడు. గొల్లడు తన గేదెను చాకలినుంచి అంది పుచ్చుకుంటూ "ఆ కుండలోనివి నీళ్లు కావు. ఏరుపిడకలు" అన్నాడు.

పెద్దవర్షం తగ్గి కాస్తో కూస్తో ఆకేసి తెరపిచ్చి వాలిన ఆకాశాన్ని సూర్యాస్తమానం ఇంకా వున్నా నంటూవుంది. కాని నెత్తిమీది మేఘం మేఘంలాగే వుండి బిందిస్తూనే వుంది ఇంకా.

ముసిల్ది "గొల్లబోయిడా! వారితో ఈ గొడుగు ఆ తల కేసి చాపెట్టి ఈ పిడకలుపేర్చి అంటించమను. చమురున్న వాళ్లైతే ఎంతోసేపా దీపించడం" అంది. అంటూనే కళ్ళమ్మట నీళ్లెట్టుకుని "నా తండ్రికి చమురుండక పోవడమేమిటి? మంచి

నడికాలపుమనిషి!” అని — నిజంగా చెబితే నమ్ముతారో నమ్మరో — పెద్ద పెట్టున ఏడ్చింది.

గొల్లబోయడు నిర్విణ్ణుడై పోయినాడు. చాకలి మాలదాని తాటాకుగొడుగు అందిపుచ్చుకొని ఆ విప్రశవానికి శిరంవెంపు చాటుగా పట్టుకున్నాడు. వారసు అనే ఆతడు తనచేతిలోనికి ముసిల్ది కుండలోంచితీసి అంత దూరాన్నుంచి విసరుతూవుంటే గొడుగుచాటునే కూర్చుండి ఏరు పిడకలందిపుచ్చుకుంటూ పేర్చి దహనసంస్కారం గావించాడు.

కాష్ఠపు మంటను చూస్తూ ముసిల్ది “ శ్రీ సూర్యనారాయణ మూర్తి కంటే తేజశ్శాలి నా తండ్రి!” అని అనుకొని తక్కిన వాళ్ళంతా వెళ్ళిపోయిందాకానిల్చి ఇంకా మిక్కిలి స్మరించిందిలా. “నా తండ్రి! నేనడగనేలేదు. నేనెత్తమనేలేదు. అలాజపం చేసుకొంటూవున్నా అయన, నా కష్టంకనిపెట్టి, అలా తనచెయ్యి నా కడవమీదఆంచి నిండుకుండ నెత్తికెత్తాడు. ఇప్పుడెవరెత్తుతారు? ఇప్పుడెవరెత్తుతారు? అని వానచినుకులో కన్నీళ్లో ఏర్పరుప రాకుండా పూరింపుగన్న తన పేదకుండను అక్కడే విడిచిపెట్టి మళ్ళీవస్తానంటూ సెలవుపుచ్చుకుంది.

.... .... .... .... ....

## ఋ జు వు ఛా ర ము

ఆండాళ్ళమ్మకు కళ్యాణి కూతురు. ఆమెకు సంతాన మా కూతురొక్కర్తుకే. ఆండాళ్ళమ్మ భర్తపేరు తిరువెంగళాచార్యులు. తిరువెంగళాచార్యులు పేరు మాని యాండాళ్ళమ్మ పేరెత్తు